

భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 30.0

కనిష్ఠం : 26.0



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

సీపీఐ జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కార్యదర్శిగా కోనాల భీమారావు

భీమవరం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):సీపీఐ జిల్లా కార్యదర్శిగా కోనాల భీమారావుతో పాటు తొమ్మిది మంది జిల్లా కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, బొద్దాని నాగరాజు,సికిలే పుష్పకుమారి, నెక్కంటి క్రాంతి కుమార్, సనపల శ్రీనివాసరావు, మండల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. 31 మందితో జిల్లా సమితి ఏకగ్రీవంగా ఎన్నికైంది. రెండు రోజులుగా తణుకులో జరిగిన సీపీఐ జిల్లా 27వ మహాసభల తీర్మానాలను గురువారం జిల్లా సీపీఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో భీమారావు వెల్లడించారు. సుదీర్ఘంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ప్రజల భాగస్వామ్యంతో దశల వారీ పోరాటాలు చేస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వరద పోటు



కనకాయలంక కాజ్ వే వద్ద పడవలలో ప్రయాణిస్తున్న గ్రామస్తులు

నరసాపురం వశిష్ట రేవుల్లో ఉధృతి

కొత్త, పాత నవరసపురం గ్రామాల్లో అప్రమత్తం

తుఫాన్ భవనాలు సిద్ధం

ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం వద్ద నిలకడగా ప్రవాహం

వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29 గ్రామాలకు రాకపోకలు బంద్

పత్తిచేలు మునక.. పడవపై ప్రయాణించి గ్రామస్థులతో మాట్లాడిన కలెక్టర్, జేసీ

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం/ ధవళేశ్వరం/ ఆచంట/యలమంచిలి / నరసాపురం రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి నదులకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దిగువకు వస్తున్న వరద నీటితో వేలేరు పాడు, కుక్కునూరు మండలాల్లోని 29 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఈ రెండు మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు రహదారులపైకి వరద చేరుకోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి పోయాయి. గురువారం సాయంత్రం వరకు భద్రాచలం వద్ద పెరుగుతూ వచ్చిన వరద సాయంత్రం ఏడు గంటల నుంచి కొంత మేర తగ్గుముఖం పట్టింది. 52.9 అడుగులకు చేరుకున్న వరద సాయం త్రం ఏడు గంటలకు అడుగు మేర తగ్గి 51.9 అడుగులకు చేరింది. భద్రాచలం నుంచి దిగువకు 13 లక్షల 60 వేల క్యూసెక్కుల వరద వస్తుండడంతో దీనికి అదనంగా శబరి వరద తోడవటంతో దీని ప్రభావం వేలేరుపాడు మండలంపై తీవ్రంగా పడుతోంది. వేలేరుపాడు, కోయిదా రహదారి, వేలేరుపాడు, రుద్రమ్మకోట, రేపాకగొమ్ము ప్రధాన రహదారి మునగడంతో అధికారులు ప్రజలను తరలించేందుకు లాంచీలను ఏర్పాటు చేశారు.



పడవపై జేసీ పర్యటన

కుక్కునూరు మండలంలోని పలుచోట్ల పత్తి పంటలు నీటమునిగాయి. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వున్న ఇసుక తిన్నెలు, కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీట మునిగాయి. ఏటిగట్టుకు కుడి వైపున కడెమ్మ కాలువ జలాలు, కొండ వాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే మార్గం లేక పంట పొలాలు నీటమునిగాయి. ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుంది. గురువారం ఉదయం 6.50 గంటలకు నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం రాత్రి 7 గంటలకు గోదావరి నీటి మట్టం 13 అడుగులకు చేరుకోగా 11, 65, 473 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తున్నది. అర్ధరాత్రి దాటిన తరువాత నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి 13.75అడుగులకు చేరుకుంటుందని అధికారులు అంచనా.

నరసాపురం వశిష్ట రేవుల్లో ఉధృతి



ఆచంట మండలంలో పుష్కరఘాట్‌లు నీట మునిగాయి. గోదావరిలో పడవలు రాకపోకలు నామమాత్రంగానే తిరుగుతున్నాయి. లంకగ్రామాల ప్రజలతో పాటు గోదావరి తీర ప్రాంత ప్రజల్లో భయం నెలకొంది. లంకగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీవో దాసిరాజు అన్నారు. గురువారం ఆయన, తహసీల్దార్ జి.కనకరాజు కోడేరు నుంచి పడవపై అయోధ్యలంక వెళ్ళి లంకగ్రామాల్లో పరిశీలించారు. నరసాపురం వశిష్ఠకు వరద ఉధృతి పెరుగుతుండ టంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పట్టణంలోని రేవులన్నీ నీట మునిగాయి. వలంధర్ రేవులోని పిండాల రేవు, బాపు ఘాట్‌ల్లో నీరు మెట్లపైకి చేరింది. రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే వరద ఉధృతికి కొత్త, పాత నవరసపురం గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది. ఇటు పొన్నపల్లి, లాకుపేట ప్రాంతాల్లో వరద నీరు చేరే అవకాశం ఉంది. దీంతో ఆర్డీవో దాసిరాజు అధికారుల్ని అలెర్ట్ చేశారు. వరద వస్తే ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా తుఫాన్ భవనాలను సిద్ధంగా ఉంచాలన్నారు.

కాజ్ వే వద్ద పడవల్లో రాకపోకలు

యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే మూడు రోజులుగా వరద ముంపులోనే ఉంది. స్థానికులు పడవల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉధృతితో కనకాయలంక, పెదలంక గ్రామాల్లోని లంకభూముల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. మండలంలోని అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి, చించినాడ, బాడవ గ్రామాల్లోన్ని

- మిగతా 8లో..

రేవుల్లో నిలిచిన రాకపోకలు

నరసాపురం : నరసాపురం వద్ద వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతం నుంచి సముద్రంలోకి సుమారు ఐదు లక్షల క్యూసెక్కుల నీరు విడిచిపెట్టడంతో రేవుల్లో నీటిమట్టాలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య పంటు, పడవల రాకపోకల్ని నిలిపివేశారు. ఉభయ గోదావరి జిల్లాల మధ్య రాకపోకలు ఎక్కడి క్కడే స్థంభించిపోయాయి. చించినాడ వంతెన మూసివేయడంతో ఉదయం పది గంటల వరకు ఇటు కోనసీమకు, అటు నుంచి పశ్చిమకు వచ్చే మార్గం లేకపో యింది. లంక గ్రామాల నుంచి చదువులు నిమిత్తం వచ్చే విద్యార్థులు కాలేజీలు, స్కూళ్లకు రాలేకపోయారు. లంక గ్రామాల నుంచి పాలు కూడా పట్టణానికి రాలేదు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున విన్నపాలు రావడంతో ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ శ్రీవేదలు మాధవాయిపాలెం రేవులను సందర్శించారు. వరద ఉధృతంగా ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ రాకపోకలకు అనుమతి ఇవ్వొదని ఎంపీడీవో వీరభద్రరావును ఆదేశించారు. చించినాడ నుంచి రాకపోకల్ని పునరుద్ధరించేందుకు ఎన్‌హెచ్ అధికారులతో ఆర్డీవో ఫోన్‌లో మాట్లాడారు. తాత్కాలికంగా పనుల్ని ఆపి కార్లు, బైక్‌లకు అనుమతి ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి ఉన్నారు.



పెదమల్లం లంకలో పడవపై విద్యార్థుల అవస్థలు

ఏటా ఇవే అవస్థలు

ఆచంట : గోదావరి వచ్చినా తగ్గినా మా కష్టాలు ఎపుడూ అలాగే ఉంటున్నాయని లంకగ్రామాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆచంట మండలం పెదమల్లం లంక, అనగార లంక విద్యార్థులు చదువుల కోసం పడవలపై యర్రంశెట్టివారిపాలెం వరకు వెళ్లి అక్కడి నుంచి గన్నవరం వెళుతుంటారు. ప్రస్తుతం గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉన్న కారణంగా విద్యార్థులు పడవలపై వెళ్లవలసి ఉంటుంది. గోదావరి ఉధృతి దృష్ట్యా విద్యార్థులు తిరుగు ప్రయాణంలో పడవపై దిగి గోదావరిలో నడిచి తమ ఇంటికి చేరుకుంటున్నారు. గోదావరి వచ్చినపుడు పరిస్థితి ఇలా ఉంటే గోదావరి తగ్గినపుడు బురదలో నడిచి వెళ్లాల్సి ఉంటుందని విద్యార్థులతో పాటు లంక గ్రామాల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బార్



సిండికేట్

దరఖాస్తులు వేయకూడదని నిర్ణయం

బార్ పాలసీపై పెదవి విరుపు

నాలుగు దరఖాస్తుల విధానంపై విముఖత

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బార్ యజమానులు సిండికేట్ అయ్యారు. బార్‌లకు దరఖాస్తులు వేయకూడదని నిర్ణయించుకున్నారు. ప్రతిఏటా లైసెన్స్‌లు దక్కించుకోవడానికి బార్ యజమాను లంతా ఒక్కటయ్యేవారు.ఈసారి దరఖాస్తులు వేయకుండా ఉండాలని ఏకమయ్యారు. బార్ పాలసీ విధానంలో లైసెన్స్ దారులు నష్టపోయే నిర్ణయాలు ఉన్నాయంటూ యజమానులు గుసగుసలాడుకుంటున్నారు. గడచిన మూడేళ్లపాటు బార్‌లు నిర్వహించిన బార్ లైసెన్స్ దారులంతా ఇప్పుడు ఒక్కటై దరఖాస్తులు వేయడానికి విముఖత చూపుతున్నారు. వాస్తవానికి ఈనెల 26వ తేదీలోగా దర ఖాస్తులు సమర్పించాలి. జిల్లాలో 28 బార్‌లున్నాయి. గతంలో 24 బారులు ఉండేవి. ప్రస్తుతం 28కి పెంచారు. అందులో మూడు బార్‌లను గీత కార్మికులకు మంజూరు చేశారు. మిగిలిన 24 బార్‌లలో అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకునేలా విధివిధానాలను ఖరారు చేశారు. వాస్తవానికి ఏళ్ల తరబడి బార్ నిర్వహణలో ప్రమేయం ఉన్నవారే దరఖాస్తులు చేస్తున్నారు. కొత్తవారు ఆసక్తి చూపడం లేదు. ప్రతిఏటా సిండికేట్ అయి ముందుగానే బార్‌లు మాట్లాడుకునేవారు. పట్టణాల్లో కేటాయించిన వాటిలో ఎవరు ఏ బార్‌కు దరఖాస్తు చేసుకోవాలో సంప్రదింపులు చేసుకునేవారు. వైసీపీ హయాంలోనూ ఇదే జరిగింది. అప్పట్లో వైసీపీ నేతలు తలదూర్చారు. సిండికేట్ అవ్వాలంటే ముడుపులు చెల్లించాలని పట్టుబట్టారు. అనుకున్నట్టుగానే జిల్లాలోని తాడేపల్లిగూడెం వంటి పట్టణాల్లో ముడు పులు చెల్లించి మరీ బార్‌లు దక్కించుకున్నారు. ఈసారి జిల్లాలోని అన్ని బార్‌లలోనూ దరఖాస్తులు చేయకూడదని అంతా ఏకమయ్యారు. ఈనెల 26లోగా దరఖాస్తులు సమర్పించాలి. ఇప్పటిదాకా ఒక్క

- మిగతా 8లో..


ఉండి లక్ష్మీ థియేటర్ సమీపంలో రోడ్డుపై గోతుల్లో చేరిన వర్షపు నీరు


కొయ్యలగూడెం - కన్నాపురం రహదారిలో భారీ గొయ్యి


టి.నరసాపురం వద్ద ట్రాక్టర్ పైనుంచి గోతిలో పడిన కలప


దెందులూరు మండలం పోతునూరు-ఉంద్రాజవరం రోడ్డుపై దిగబడిన లారీ

ఆంధ్రజ్యోతి పరిశీలన


జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం రోడ్డుపై గండి

దారి.. ధ్వంసం

అడుగడుగునా గోతులతో రహదారులు నరకానికి మార్గాలుగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా రోడ్లు ఎక్కడికక్కడ గోతులు, రాళ్లతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లుగా రహదారులకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో చాలా చోట్ల రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఇటీవల వర్షాలకు మరింత ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారి బాధలు మరింత దయనీయం. ఏజెన్సీలో రహదారులు మరింత భయంకరంగా ఉన్నాయి. ఏటా రహదారులకు గండి పడడం సాధారణమైంది. లోడు వాహనాల పక్కనుంచి వెళితే ఏ వాహనం పడిపోతుందని ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు. రహదారుల దుస్థితిపై ఆంధ్రజ్యోతి పరిశీలన..

- గోతులు, రాళ్లతో రహదారులు అధ్వానం
- ప్రధాన, గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తం
- వర్షపు నీటితో నిండిన గుంతల్లో ప్రమాదాలు
- గాయపడుతున్న వాహనదారులు
- ప్రయాణాలు నిత్య నరకం
- తాత్కాలిక మరమ్మతులతో సరి
- ప్రమాదకరంగా లోడు వాహనాల రాకపోకలు

చింతలపూడిలో ఎక్కడికక్కడ గోతులు

చింతలపూడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చింతలపూడి రహదారులపై ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. వెలగలపల్లి రోడ్డు, చింతలపూడి పట్టణం తీగలవంచ, దమ్మపేట, అల్లిపల్లి రోడ్డు, జీలకర్రగూడెం వద్ద గోతులు అలాగే ఉన్నాయి. ఇటీవల రేచర్ల వద్ద పెద్దపెద్ద గోతులను పూడ్చినా మళ్లీ గోతులు పడడంతో సిమెంటు రోడ్డు వేశారు. చింతలపూడి నుండి రేచర్ల సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుంది. హైవే అవతల యర్రగుంటపల్లి వరకు రోడ్డు అధ్వానం. చింతలపూడి - తీగలవంచ రోడ్డు అధ్వానంగా ఉంది. చింతలపూడి మెయిన్ రోడ్డు అడుగడుగునా గోతులే. ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో వర్షపునీరు రోడ్లపై నిలిచి ఈ గోతులు ఏర్పడుతున్నాయి.

లింగపాలెంలో అడుగడుగునా గొయ్యి

ఏలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో రహదారుల పై అడుగడుగునా గోతులే. వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపు నీరు రోడ్లపై చేరి చెరువులను తలపిస్తున్నాయి. గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెదపాడులో పెద్ద పెద్ద గుంతలు

పెదపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అడుగుకో గొయ్యి... గజానికో గుంతతో పెదపాడు - వట్లూరు రహదారి ఛిద్రం కావడంతో వాహనదారులు హడలిపోతున్నారు. పెదపాడు - వట్లూరు రహదారిలో నిత్యం వివిధ కళాశాలలు, పాఠశాలలకు విద్యార్థులు, వ్యవసాయ పనులపై రైతులు, రైతు కూలీలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ గోతులలో ప్రయాణించేటప్పుడు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. చిన్నపాటి వర్షాలకే గోతులు నీటితో నిండిపోతున్నాయి.

దెందులూరు రహదారిపై బెంబేలు

దెందులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోతునూరు శివారు ఉంద్రాజవరం రోడ్డు జాతీయ రహదారి నుంచి ప్రమాదభరితంగా మారింది. రహదారిపై ప్రయాణానికి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే రహదారిపై కొందరు నడిచి వెళుతున్నారు. ఏ భారీ వాహనం మీద పడుతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. కొల్లేరు గ్రామాలతో పాటు పోతునూరు, ఉంద్రాజవరం గ్రామస్తులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.

రహదారులు నరకప్రాయం

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో రహదారులు పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం పడితే తిరుమలాపురం రహదారి చెరువులను తలపిస్తుంది. శ్రీనివాసపురం- ములగలంపల్లి రహదారిపై రాళ్లు పైకి లేస్తున్నాయి.


చింతలపూడి మెయిన్ రోడ్డులో భారీ గొయ్యి


పందిరిమామిడిగూడెం-కామవరం రహదారి


పెనుగొండ - మునమర్రు రహదారి


జంగారెడ్డిగూడెం-తిరుమలాపురం రోడ్డుపై చెరువు

రాళ్లు.. గోతులతో ఏలూరు రోడ్లు

ఏలూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం రోడ్లు గోతులు, రాళ్లతో దారుణంగా ఉన్నాయి. వాహనచోదకులు, ప్రజలు హడలిపోతున్నారు. వంగాయగుడెం నుంచి కొత్తూరు రహదారి అధ్వానంగా మారింది. సుమారు మూడు కిలోమీటర్లు మేర రోడ్లు పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదభరితంగా ఉంది. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ఛిద్రమైపోయాయి. వాహనచోదకులు, ప్రజలు ఈరోడ్డుపై ప్రయాణించేందుకు నరకం చూస్తున్నారు.

భీమడోలు రహదారులు ఛిద్రం

భీమడోలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారుల పై గోతులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. భీమడోలు, గుండుగొలను, కొల్లేరు గ్రామాల రహదారులు ప్రస్తుత వర్షాలకు ఛిద్రమయ్యాయి. భీమడోలు రైల్వేగేటు నుంచి ద్వారకాతిరుమల మినీ బైపాస్ రోడ్డు గోతుల మయమైంది. వాహనదారులు, ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. కనీసం మకమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఉంగుటూరు మార్గం అధ్వానం

ఉంగుటూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల వర్షాలకు రహదారులు మరింత పాడవడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఉంగుటూరు-శింగరాజుపాలెం గ్రామాల మధ్య రహదారి గోతులు పడడంతో రాత్రి వేళ్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఉండి-చేబ్రోలు రహదారిలో ఆర్ అండ్ బీ రహదారి కూడా ఈ వర్షాలకు దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉండి రహదారికి తూట్లు

ఉండి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉండి-చేబ్రోల్ జాతీయ రహదారికి తూట్లుపడ్డాయి. వర్షాలకు రహదారిపై మరిన్ని భారీ గోతులు పడ్డాయి. ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భీమ వరం నుంచి ఉండి మీదుగా పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు రోడ్, పాందువ్వ రోడ్డు, ఆరేడు మీదుగా గణపవరం ఆర్టీసీ బస్సులు వెళుతుంటా యి. అక్కడి నుంచి తాడేపల్లిగుడెం, చేబ్రోల్, నారాయణపురం మీదుగా ఏలూరు బస్సులు, వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. తక్షణమే మరమ్మ తులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

పెనుగొండలో బురద మార్గం

పెనుగొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వర్షాలకు పెనుగొండ మండలంలో రహదారులు బురదమయం అయ్యాయి. గోతులతో ప్రమాదకరంగా ఉన్నాయి. పెనుగొండ నుంచి మునమర్రు, సోమరాజు చెరువు నుంచి కొఠాలపర్రు రహదారులపై గోతుల్లో నీరు నిలిచిపోయింది. వాహనదారులు, ప్రయాణికులు తరచు ప్రమాదాలకు గురవుతున్నారు.


గోతులతో అధ్వానంగా ఉన్న ఏలూరు-వంగాయిగూడెం రోడ్డు

మామిడిగూడెం-కామవరం రోడ్డు మాయం

బుట్టాయగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిరి మామిడిగూడెం-కామవరం మధ్య ఆర్‌అండ్‌బి రోడ్డులో గోతులు ప్రత్యక్షమయ్యాయి. కామవరం, మోతుగూడెం కాలనీ, తానిగూడెం, కోర్సవారిగూడెం గ్రామాల కొండరెడ్లు, గిరిజనులు కేఆర్‌.పురం ఐటీడీఏ, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి, గుబ్బల మంగమ్మతల్లి ఆలయానికి ఏకైక మార్గం ఇదే. పందిరిమామిడిగూడెం-కామవరం రోడ్డు గోతులమయం కావడంతో రోడ్డు నిర్మించాలని గిరిజనులు వేడుకున్నారు. కొత్తరోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించి ఉన్న రోడ్డును పూర్తిగా తవ్వి క్వారీ రజను పోసి వదలేశారు. నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. వర్షాలకు రజను కొట్టుకుపోయి రహదారి కనిపించనంతగా గోతులు ఏర్పడ్డాయి.


భీమడోలు జంక్షన్‌లో రోడ్డుపై భారీ గోతులు

ఏజెన్సీ రోడ్డు ప్రమాదభరితం

పోలవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోలవరం నుంచి ఇటుకలకోట, గుంజవరం మీదుగా దొండపూడి రోడ్డు భారీ గోతులతో ప్రమాదభరితంగా తయారయ్యింది. గోతుల్లో వర్షం నీరు నిండి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గం అధ్వానం కావడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేశారు. బండారుగూడెం నుంచి ముత్యాలరావుపేట గ్రామానికి రాకపోకలు సాగించడం కష్టసాధ్యం. ఆ మార్గం ద్వారా తహసీల్దారు, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడానికి జిల్లేళ్లగూడెం, పేడ్రాల, కుంకాల, ముత్యాలరావు పేట, రెడ్డినాగంపాలెం, కోయనాగంపాలెం గ్రామాల ప్రజలు 15 కిలోమీటర్ల ఆటోలలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడి చేరుకోవాలి. అక్కడి నుంచి 15 కిలో మీటర్లు ప్రయాణించి పోలవరం చేరుకోడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


లింగపాలెం మండలం ములగలంపాడులో రోడ్డుపై గోతులు

జీలుగుమిల్లి రోడ్లకు గండి

జీలుగుమిల్లి, ఆగస్టు 21: (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వంకవారిగూడెం వాగు వద్ద గండి పడింది. పదేళ్లుగా స్థానికులు సొంత ఖర్చులతో వర్షాకాలంలో గండి పూడ్చి రాకపోకలు సాగిస్తున్నారు. వాగు వద్ద వరదనీటి ఉధృతికి మళ్లీ గండి పడింది.

ప్రయాణం దినదిన గండం

టి.నరసాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోడ్లు గోతులతో ప్రయాణం చేయాలంటే దినదినగండంగా మారింది. టి.నరసాపురం నుంచి మక్కినవారిగూడెం, అప్పలరాజుగూడెం మీదుగా లక్ష్మీపురం రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారాయి. అప్పలరాజుగూడెం వద్ద పెద్దగొయ్యిలో కలపలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గోతిలో దిగిన ట్రాక్టర్ ఒరిగిపోయింది.


వట్లూరు-పెదపాడు రహదారి గోతులమయం

కన్నాపురం రోడ్డుపై ప్రయాణం నరకం

కొయ్యలగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం-కన్నాపురం రహదారిపై అడుగడుగునా గోతులే. కొయ్యలగూడెం నుంచి పోలవరం వెళ్లడానికి, ఐటీడీఏ కార్యాలయం వెళ్లడానికి కూడా ప్రధాన రహదారి ఇదే. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రెండేళ్లుగా రహదారి పాడై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై పెద్ద పెద్ద గోతులతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల్లో వర్షం నీరు నిండిపోయి వాహనాలు నిలిచిపోతున్నాయి. వాహనచోదకులు ప్రమాదాల బారినపడి గాయపడు తుంటే వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల వర్షాలకు మరిన్ని గోతులు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


అధ్వానంగా పోలవరం గుంజవరం ఏజెన్సీ రోడ్డు

యోగాతో మానసిక ప్రశాంతత


యోగా పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణప్రసాద్, పెదకృష్ణంరాజు


రాష్ట్రస్థాయి పోటీల్లో యోగాసనాలతో ఆకట్టుకున్న బాలుడు

వైఎస్‌ఏపీ గౌరవ అధ్యక్షుడు రామకృష్ణప్రసాద్

ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ పాఠశాలలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ప్రారంభం

పెంటపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : యోగాతోనే ఆరోగ్య వంతమైన జీవనం సాధ్యమని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ (వైఎస్‌ఏపీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల శరీరంలో ఉండే అనేక సమస్యలు ఎటువంటి మందులు వాడకుండానే నివారణ అవుతాయన్నారు. ప్రతీఒక్కరూ రోజుకు కొంతసమయాన్ని యోగా లేదా శారీరక వ్యాయామానికి కేటాయించాలన్నారు. అనంతరం యోగా పోటీలను ప్రారంభించారు. రాష్ట్రం నుంచి మొత్తం సుమారు 500 మంది అభ్యర్థులు యోగా పోటీలలో పాల్గొనేందుకు వస్తున్నట్లు పాఠశాల చైర్మన్ కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు తెలిపారు. కార్యక్రమంలో కొలనువాడ పెదకృష్ణంరాజు, రవీంద్రనాథ్, ఏసుబాబు, కే.రామకృష్ణ, మాధవరావు, దుర్గారావు, డాక్టర్ పల్లవి, గట్టిం మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

సుందర గిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువు దీరిన శ్రీలక్ష్మీనారసింహుని ఆలయంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన దివ్యపవిత్రోత్సవాలు గురువారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. స్మార్త ఆగమాన్ని అనుసరించి ఈనెల 19 నుండి మూడురోజులు పాటు తొలిసారి దివ్యపవిత్రోత్సవాలు నిర్వహించేం దుకు దేవస్థానం శ్రీకారం చుట్టిన విషయం విదితమే.. ఏడాదిలో ఆలయంలో తెలిసి తెలియక దొర్లిన తప్పుల ప్రాయఃశ్చిత్తం నిమిత్తం ఈ ఉత్సవాలను జరుపుతారు. ఈక్రమంలో గురువారం ఆలయ యాగశాలలో మహాశాంతి హోమం, పౌష్టిక హోమం, శ్రీమహాపూర్ణాహుతి హోమం, పవిత్రవిసర్జన, శాంతికల్యాణంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తం అయ్యాయి. ఆలయ ఈవో ఎన్‌వీ.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. లక్ష్మీపురం ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న దివ్య పవిత్రోత్సవాలు గురువారం జరిగిన శ్రీమహాపూర్ణాహుతి హోమంతో ముగిశాయి.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

చిన వెంకన్న క్షేత్రంలోని అనివేటి మండపం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను పెద్ద ఎత్తున జరిపేందుకు దేవస్థానం చేసిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రత నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ఇప్పటికే వేదికను నిర్మించారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా అరటి బోదెలు, మామిడి తోరణాలతో సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. అధికసంఖ్యలో ముత్తైదువులు హాజరుకావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వారికి దేవస్థానం కొంత మేర పూజా సామగ్రి అందజేస్తుందని అధికారులు చెబుతున్నారు. వందల సంఖ్యలో మహిళలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.


ఆలయంలో శాంతికల్యాణంలో కనకవల్లీ సమేత లక్ష్మీనారసింహుడు



ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలు
దరఖాస్తు గడువు 24

ఏలూరు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు ప్రతిపాదనలను స్వీకరిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ గురువారం తెలిపారు. అర్హతలు, ఆసక్తివున్న టీచర్లు లీప్ యాప్‌లో అంతర్ జిల్లా బదిలీలకు ఈ నెల 24లోగా దరఖాస్తుచేసుకుని, ప్రింటవుట్ సంబంధిత ఎంఈవోకు సమర్పించాలన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జీవిత భాగస్వామి ఆధారంగా స్పౌజ్ కేటగిరీ, పరస్పర అభ్యర్థనల ప్రకారం మ్యూచువల్ అంతర జిల్లా బదిలీలకు దరఖాస్తులను ప్రాసెస్ చేస్తామని వివరించారు. బదిలీలకు అర్హతలు, ఇతర వివరాలు, ప్రొఫార్మాల కోసం www.deoeluru.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన త్రిమూర్తులు

కృష్ణబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా
బాధ్యతలు చేపట్టిన త్రిమూర్తులు

భీమవరం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఏపీ కృష్ణ బలిజ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గంటా త్రిమూర్తులు విజయవాడలోని గొల్లపూడి బీసీ సంక్షేమ కార్యాలయంలో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తనకు ఈ పదవి రావడానికి సిఫార్సు చేసిన తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కేంద్ర మంత్రి వర్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మంతెన రామరాజు, ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు కృతజ్ఞ తలు తెలిపారు. బీసీ కార్పొరేషన్ అధికారి జేఎండి ఉమాదేవి నుంచి త్రిమూర్తు లు అధికార పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ భీమవరం పట్టణ అధ్యక్షుడు ముద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, యలమంచిలి శ్రీను, మర పట్ల శ్యాంబాబు, కాపా అమర్‌బాబు, వినాయక్, తోట వెంకటేశ్వరరావు, గొల గాని దుర్గారావు, అన్నం నాంచారయ్య, జె.రాజు, జె.దుర్గ, నేదునూరి గంగాధర్ తిలక్, మద్దుల సాయి, తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలకు సహకరిస్తా
ఆస్ట్రోనాట్ జాహ్నవికి కేంద్ర మంత్రి వర్మ హామీ



జాహ్నవిని సత్కరించిన మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్/పాలకొల్లు టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):అమెరికాలోని ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్(టీఎస్ఐ)' 2029లో నిర్వహించే అంతరిక్ష యాత్రకు ఎంపికైన పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి(23) గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా వర్మను కలిసిన జాహ్నవి, తన భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. జాహ్నవి దేశానికి మరింత పేరు తీసుకొచ్చేందుకు అన్ని విధాలా ఆమె శిక్షణ, భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలకు సహకరిస్తానని వర్మ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి అభినందించారు.

వెంకటరమణ ట్రస్టు సేవలు అభినందనీయం
- కలెక్టర్ నాగరాణి



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పెంటపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్న శ్రీవెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కలెక్టర్ నాగరాణి అన్నారు. అలంపురం ట్రస్టు ఆసుపత్రిని గురువారం సందర్శించారు. రోగులతో మాట్లాడి ట్రస్టు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ట్రస్టు చైర్మన్ పెదకృష్ణంరాజు సేవలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో వేలాది మందికి వైద్య సేవలందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. కృష్ణంరాజు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రజలకు తన వంతు సేవలు చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు, ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌బనో, తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ.సత్యనారాయణ, సర్పంచ్ తాతపూడి ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఏఆర్‌డీజీకే విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

ఏలూరు రూరల్, ఆగస్టు 21, (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారపు పేట ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 17న విజయనగరం జిల్లా కొండవెలగాడలో జరిగిన అస్మిత్ ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం.పావని 44 కేజీల విభాగంలో బంగారు పతకం, ఎం.దీక్షిత 44 కేజీల విభాగంలో రజత పతకం, సీహెచ్ కీర్తన 58 కేజీల విభాగంలో రజత పతకం, కె భార్గవి 58 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈనెల 23న విశాఖపట్నంలో జరిగే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వి.క్రాంతి జయకుమార్ తెలిపారు.

గురుకులం విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో గురుకులం అధ్యాపకులు

దెందులూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న కవాతుతో పాటు పలు విన్యాసాల్లో వరసగా మూడోసారి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధిం చిన గురుకులం విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. గురువారం పెదవేగి మండలం లక్ష్మీపురంలోని ఏపీ ప్రభుత్వ అంబేడ్కర్ గురుకులంలో వరుసగా మూడవసారి రాష్ట్రస్థాయిలో గురుకులం విద్యార్థులకు మొదటి స్థానం రావడం చాలా ఆనందంగా ఉందని గురుకులం ప్రిన్సిపాల్ ఏవీ.శివ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయుడు వై.శ్రీనివాస్, పీడీ జయరాజు, సురేష్‌లు పేర్కొన్నారు.

స్వర్ణమయ పథకానికి రూ.5 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న దాత పెద్దిరాజు

ద్వారకాతిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి దాత గురువారం రూ.5లక్షల విరాళం అందజేశారు. భీమవరానికి చెందిన కొప్పిరెడ్డి పెద్దిరాజు ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో ఏఈవో పి.నటరాజారావుకు చెక్కును అందజేశారు.

మీ సేవ కేంద్రాలకు మంగళం!



జగన్ సచివాలయ వ్యవస్థతో కుదేలు » ఆదుకోవాలని మంత్రి లోకేశ్‌కు నిర్వాహకుల వినతి

వైసీపీ అధికారంలోకి వచ్చేంత వరకు ఓ వెలుగు వెలిగి ప్రజలకు సుదీర్ఘ కాలం సేవలందించిన మీ సేవ కేంద్రాల మాట ఇక మర్చిపోవాల్సిందే. జగన్ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో వీటికి చెక్ పడింది. ఫలితంగా మీ సేవ కేంద్రాల నిర్వాహకులు పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. సుమారు పది వేల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.

ఏలూరు రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందించిన మీసేవ కేంద్రాలకు మంగళం పలకడంతో వాటి నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసెంబ్లీలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఇంత వరకు నెరవేరకపోవడంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో మీసేవల నడ్డివిరిచాయి. ప్రస్తుతం అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను ఆదుకుంటామని యువగళం పాదయాత్రలో లోకేశ్ ప్రకటించారు. మీసేవ కేంద్రాలు పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాది కుటుంబాలు జీవనం సాగించేవి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీసేవలకు మహర్దశ వస్తుందని ఆశించిన నిర్వాహకులకు నిరాశనే మిగిలింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది వేల మీసేవ నిర్వాహకుల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంది. ఏలూరు జిల్లాలో 442 మీసేవ కేంద్రాలు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తేవడంతో మీసేవ కేంద్రాలు ఒక్కొక్కటిగా మూతపడ్డాయి. వైసీపీ పాలనలో మీ సేవ అందించే సర్వీసులన్నీ సచివాలయాల ద్వారా ఉచితంగా అందజేస్తామని చెప్పి తరువాత రుసుం వసూలు ప్రారంభించారు. మీ సేవ కేంద్రాల ద్వారా తీసుకున్న సర్టిఫికెట్లు చెల్లవంటూ అప్పట్లో వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో ప్రచారం జరిగింది. ఈ మేరకు ప్రజలు సచివాలయాలనే ఆశ్రయించారు. మీసేవ కేంద్రాల ద్వారా రెవెన్యూ ఏపీఎస్పీడీసీఎల్, హెల్త్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ తదితర శాఖలకు చెందిన దాదాపు 364 సేవలు ప్రజలకు అందించేవారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుంలో కొంత భాగం కమీషన్ రూపంలో మీసేవ నిర్వాహకులు తీసుకునేవారు.

తగ్గిపోయిన సేవలు

గతంలో 364 సేవలందించి అనేక మందికి ఆసరాగా నిలిచిన మీ సేవ కేంద్రాలు తాజాగా సేవలు లేక కుచించుకు పోతున్నాయి. ఇటు ప్రభుత్వ రంగంలోని చలానాలు, పాస్‌పోర్ట్ దరఖాస్తు నుంచి డ్రైవింగ్ లైసెన్స్ వరకు అన్ని సేవలు అందించేవి.

ప్రస్తుతం ప్రభుత్వ సీఎస్‌సీ సెంటర్‌లకే ఈ సేవలన్నింటిని పరిమితం చేసి మీ సేవ కేంద్రాల ద్వారా కరెంటు బిల్లులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ స్టేషన్‌ల కంప్లెయింట్స్ తప్ప మరే సేవలు ఉండడం లేదని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 400 సెంటర్‌లు ఉండేవి. ప్రస్తుతం 250 సెంటర్‌లకు పడిపోయాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి



మంత్రి నారా లోకేశ్ హామీని అమలుపరచాలి. అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చులు స్వయంగా భరిస్తూ కేంద్రాలు నడుపుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికే కొన్ని కేంద్రాలు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశిస్తున్నాం. ప్రభుత్వం చొరవ చూపి మీసేవా కేంద్రాల భవితవ్యంపై సుముచిత నిర్ణయం తీసుకుని పూర్వ వైభవం తీసుకువచ్చేలా న్యాయం చేయాలి.

- టి.స్వరూపరాణి, రాష్ట్ర అధ్యక్షురాలు. రాష్ట్ర గ్రామీణ మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘం

అసంతృప్తి సేవలు

సచివాలయాల ద్వారా మీసేవ సేవలను అందించాలని గత వైసీపీ ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాల ద్వారా ప్రజలు అసంతృప్తిలో ఉంటున్నారు. మీ సేవల ద్వారా అందించే సేవలను కుదించడం వల్ల ఇటు సచివాలయాల వద్ద పనులు కాక, మరోపక్క మీసేవల ద్వారా పనులు ముందుకు కదలక ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత విధానాలు అమలు చేయడంతోపాటు సచివాలయాలు, మీసేవా సెంటర్లు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందించాల్సిన అవసరం ఉంది.

కొండలరావుపాలెంలో
ఉద్రిక్తత

- » వైసీపీ శ్రేణులు.. కొల్లేరు గ్రామస్థుల మధ్య ఘర్షణ
- » నిరసనకారుల పైకి దూసుకొచ్చిన మాజీ ఎమ్మెల్యే కొఠారు
- » ఇరు వర్గాలను చెదరగొట్టి పంపించిన పోలీసులు



కొల్లేరు గ్రామస్థులపైకి దూసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు, వైసీపీ కార్యకర్తలు



కొండలరావుపాలెంలో నీటి సంఘం అధ్యక్షుడిపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు

దెందులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చేపల చెరువు లీజు సొమ్ము చెల్లించాలని కొంతకాలంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై దాడులు చేయించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారనే అనుమానంతో కొల్లేరువాసులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించి వేశారు. కొల్లేరు గ్రామాలైన ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు, ప్రత్తికోళ్లలంక వాసులు తమ చేపల చెరువు లీజు డబ్బులు చెల్లించాలని కొద్దిరోజులుగా కొఠారు నివాసం వద్ద వంటా వార్పుతో నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం లండన్ నుంచి వచ్చారు. తన పామాయిల్, కోకో తోటల్లో అబ్బయ్య చౌదరి కూలీలతో పంట కోత పనులను చేపట్టారు. ఈ విషయం తెలియడంతో గురువారం ఆయన నివాసం ముట్టడికి కొల్లేరువాసులు సన్నద్ధమయ్యారు. బుధవారం రాత్రి నుంచే కొఠారు ఇంటిచుట్టూ నూజివీడు డీఎస్పీ ప్రసాద్, సీఐ రాజశేఖర్, ఎస్ఐలు కె.రామకృష్ణ, శివాజీ ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు చేపట్టారు. కొల్లేరు గ్రామస్థులు పోలీసుల కన్ను గప్పి గురువారం ఉదయం కొఠారు ఇంటికి చేరుకుని నిరసనకు దిగారు. వారికి టీడీపీ వర్గీయులు మద్దతుగా నిలిచారు. వీరిని వైసీపీ వర్గీయులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. 'నా పొలంలో పామాయిల్, కోకో కాయలను కోసుకుంటుంటే ఎవరు వచ్చి పనులు ఆపుతారో చూస్తా' అంటూ కొఠారు దురుసుగా కొల్లేరు వాసులపైకి దూసుకు రావ డంతో వివాదం ముదిరింది. దీంతో ఇరు వర్గాల ను అక్కడ నుంచి డీఎస్పీ ఆధ్వర్యంలో పంపించి వేశారు. కొల్లేరు సంఘం నాయకులు మాట్లాడు తూ శాంతియుతంగా తమకు రావాల్సిన బాకీ డబ్బులను అడుగుతుంటే అబ్బయ్యచౌదరి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో దగ్గరుండి దాడులు చేయించడం అన్యాయమన్నారు. మరోవైపు కొఠారు స్పందిస్తూ తాను ఎవరికి లీజు సొమ్ము లు ఇవ్వాల్సిన అవసరం లేదని, దివ్యాంగుల పింఛన్‌లను ఎందుకు తొలగించారని టీడీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు సమాధానం చెప్పకుండా కక్ష సాధింపునకు దిగారన్నారు.

నీటి సంఘం అధ్యక్షుడికి గాయాలు

టీడీపీ నాయకుడు, పోతునూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు చలసాని రాంబాబుపై కొంత మంది వైసీపీ కార్యకర్తలు కర్రలతో దాడి చేశారు. ఆయనను టీడీపీ గ్రామ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్‌తోపాటు పలువురు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గాయపడిన రాంబాబును ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు.



కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు పాకా

రైల్వేశాఖ మంత్రిని కలిసిన పాకా

భీమవరంటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వందే భారత్ రైలును భీమవరం వరకు పొడిగించే విషయంపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. దీనిపై రైల్వే మంత్రి సానుకూల స్పందన తెలిపారు. తమ ప్రాంతంలో రైల్వే అభివృద్ధిని వేగవంతం చేసేందుకు పలు అంశాలపై చర్చలు జరిగాయని పాకా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో రైల్వేరంగం ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చెందుతోందన్నారు.

దగ్గు మందు వికటించి బాలుడికి అస్వస్థత
మందుల చీటీ లేకుండా మందుల విక్రయం
షాపు వద్ద బంధువుల ఆందోళన

నరసాపురం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఓ కార్పొరేట్‌కు సంస్థకు చెందిన మెడికల్ దుకాణంలోని సేల్స్‌మన్ నిర్వాకం వల్ల ఆరేళ్ల బాలుడు ప్రాణాపాయ స్థితికి చేరాడు. వైద్యుల మందుల చీటీ లేకుండా దగ్గు మందు విక్రయించడమే కాకుండా పెద్దలు వాడాల్సిన మందును చిన్న పిల్లలకు ఇచ్చాడు. పెద్దగా చదువుకోని ఆ తల్లిదండ్రులు బాలుడికి వేయడంతో వికటించి సీరియస్ అయ్యింది. కాళ్లు చేతులు కొట్టుకుని ఫిట్స్‌గా రావడంతో వెంటనే చిన్న పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. వాడిన మందును చూపించగా.. పెద్దలు వాడే ఈ మందు చిన్న పిల్లాడికి ఎలా వేశారంటూ మందలించాడు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం కుదుటపడింది. తర్వాత మెడికల్ షాపు వద్ద బాలుడి బంధువులు ఆందోళనకు దిగారు. చిన్న పిల్లాడికి అని చెప్పినా.. పెద్దలకు వేసే మందు ఎలా ఇచ్చారంటూ నిలదీశారు. బంధువుల ఆందోళనతో గురువారం రాత్రి దుకాణాన్ని మూసివేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేయడంతో గురువారం వచ్చి దుకాణాన్ని తనిఖీలు నిర్వహించారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైద్యుల చీటీ లేకుండా మందు విక్రయించిన మాట వాస్తమని విచారణలో తేలిందన్నారు. కార్పొరేట్ మందుల దుకాణదారుడికి షోకాజ్ నోటీస్ జారీ చేస్తున్నామన్నారు.

పేరుపాలెంలో బైక్ ఢీకొని యువకుడి మృతి

మొగల్తూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):పేరుపాలెం బీచ్ రోడ్డులో బైక్ ఢీకొని ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మొగల్తూరు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాలివి.. పేరుపాలేనికి చెందిన కొక్కిరగడ్డ లక్ష్మీనర్సింహస్వామి బుధవారం బీచ్ రోడ్డులోని తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి మరో వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నర్సింహస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని తల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

ఉంగుటూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోదెలో పడి ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఎం.డి.కామరుద్దీన్(52) నారాయణపురంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తన స్వస్థలం ఏలూరు వెళుండగా గురువారం ఉదయం కైకరం శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పంట బోదెలో పడిపోయి వుంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు చేబ్రోలు ఎస్.ఐ. మామిడాల సూర్యభగవాన్ తెలిపారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మృతదేహం
గుర్తించలేని స్థితిలో కుళ్లిన మృతదేహం

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న ఒక అపార్టుమెంట్ సెల్లార్‌లో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లడంతో చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు గోపాలకృష్ణ థియేటర్ సమీపంలో తుమ్మపూడి నాగవెంకట జగన్మోహనరావుకు చెందిన మూడంతస్తుల నూతన భవన నిర్మాణం జరుగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లడంతో గురువారం మధ్యాహ్నం చుట్టు పక్కలవారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వన్‌టౌన్ ఎస్ఐ మదీనా బాషా వారి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు సుమారు 35-40 సంవత్సరాల వయస్సు కలిగి గుర్తించలేని పరిస్థితిలో మృతదేహం ఉంది. కొద్ది రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వశిష్ఠ గోదావరిపై హైలెవెల్ వారధి!

ఢిల్లీలో ఉన్నతాధికారులకు కేంద్ర సహాయ మంత్రి వర్మ విజ్ఞప్తి
కమిటీ నియమిస్తామంటూ హామీ

భీమవరం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలో కీలక జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వశిష్ఠ గోదావరిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణంపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఉమాశంకర్‌ను గురువారం కలిసి చర్చించారు. ఆచంట నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన వశిష్ఠ గోదావరి నది పైన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, ఎన్‌హెచ్-216, ఆకివీడు - దిగమర్రు రహదారి పనులు త్వరితగతిన ప్రారంభించాలని, అలాగే నిలిచిపోయిన ఎన్‌హెచ్ 165 నరసాపురం బైపాస్ పనులు వేగవంతం చేయాలని శ్రీనివాస వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కూడా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రి శ్రీనివాస వర్మ,ఎమ్మెల్యే సత్యనారాయణలు కార్యదర్శి ఉమా శంకర్‌ను శాలువాతో సత్కరించారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ విజ్ఞప్తిపై కార్యదర్శి ఉమాశంకర్ సానుకూలంగా స్పందించారు. ఎన్‌హెచ్- 216, 165 పనులు ఈ ఏడాదిలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా కోడేరు నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎల్.గన్నవరం మధ్య వశిష్ఠ గోదావరిపై రూ. 504 కోట్లతో హైలెవెల్ వశిష్ఠ వారధి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను పరిశీలించేందుకు త్వరలోనే ఒక ఉన్నతస్థాయి బృందాన్ని పంపిస్తామని, రాష్ట్ర ప్రభుత్వంతో బ్రిడ్జి నిర్మాణం కోసం సంప్రదించి పూర్తి సహకారం అందిస్తామని కార్యదర్శి ఉమా శంకర్ హామీ ఇచ్చారు.



ఉమాశంకర్‌ను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, మాజీ మంత్రి పితాని

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన కాలేజీ బస్సు
గాయపడిన వారిని ఆస్పత్రికి తరలింపు - మరికొందరికి స్వల్ప గాయాలు



ధ్వంసమైన బస్సు ముందుభాగం

కాళ్ళ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):తమ పిల్లలు కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల్లో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధిస్తారనే ఆశతో తల్లిదండ్రులు స్థాయికి మించి తమ పిల్లలను ప్రైవేట్ కళాశాలల్లో చదివిస్తున్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకం బస్సులు, తక్కువ జీతాలకు దొరుకుతున్న అనుభవం లేని డ్రైవర్ల వల్ల రోజూ ఎక్కడో ఒకచోట పాఠశాల, కళాశాలల బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతూనే ఉన్నాయి. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు భయంతో జీవిస్తున్నారు.మండల కేంద్రమైన కాళ్లలో గురువారం ఉదయం ఇలాంటి సంఘటనే జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాల బస్సు విద్యార్థుల కోసం రోడ్డు పక్కన ఆగి ఉండగా, పెన్నాడలోని వైట్ ఇంజనీరింగ్ కాలేజీ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా భయంతో హాహాకారాలు పెట్టారు. బస్సును వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఆ బస్సుతో పాటు ఢీకొన్న బస్సుకి అద్దాలు ధ్వంసమయ్యాయి. రెండు బస్సుల్లోనూ సుమారు 60 మంది బాలికలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో కొంత మంది విద్యార్థినులకు ముఖం, చేతులపై పెద్ద గాయాలయ్యాయి. మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను ఆటోలో ఆసుపత్రికి తరలించారు. అనుభవజ్ఞులైన డ్రైవర్‌లను కళాశాల యాజమాన్యాలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని,ఇలాంటి యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో అనుమతి

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల వలన ఎదుటి వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా జరుపుకోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ప్రజలకు సూచించారు. ఉత్సవ కమిటీలు పోలీసుల అనుమతి కోసం రుసుం లేని సింగిల్ విండో విధానం ద్వారా https://ganeshutsav.net లింకు ఓపెన్ చేసి ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా లాగిన్ అయి అప్లికేషన్‌లో ఉన్న కాలమ్స్‌ను పూర్తి చేసి సబ్‌మిట్ చేయాలన్నారు. ఆ తరువాత పోలీస్ వెరిఫికేషన్ అయిన వెంటనే క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసుకుని మండపాల వద్ద అతికించాలన్నారు. ఉత్సవాలు నిర్వహించే వారు పోలీస్ నిబంధనలను పాటించాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో పోలీస్ శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తే ఆరు నెలలు జైలు, రూ.వెయ్యి జరిమానా ఉంటుందన్నారు. ఉత్సవాలు నిర్వహించే వారు ముందుగా సంబంధిత పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు రోడ్డుకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. శబ్ద కాలుష్యం వచ్చే స్పీకర్లు నిర్వహించకూడదని, ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే మైక్‌లను ఉపయోగించుకోవాలన్నారు. వినాయక చవితి నిమజ్జనంలో అశ్లీల నృత్యాలు కాని, డిజె సౌండ్స్ కాని నిర్వహించకూడదని అన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే వారు సీసీ టీవీ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనానికి తీసుకెళ్లే మార్గాన్ని, సమయాన్ని ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు.

నైపుణ్య శిక్షణ తరగతులు
న్యాక్ ఏడీ ఎం.వసంతరావు

ఏలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ష్వింగ్‌స్టేటర్(ఇండియా)ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఎస్ఐపీఎల్)తో అవగాహన ఒప్పందం నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో నైపుణ్య శిక్షణ తరగతులను నరసాపురం పి.ఎం. లంక డిజిటల్ కమ్యూనిటీ భవన్‌లో త్వరలో ప్రారంభమవుతాయని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) సహాయ సంచాలకులు ఎం.వసంతరావు తెలిపారు. ఏపీ ప్రభుత్వం- నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన ష్వింగ్‌స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్(ఎస్ఎస్ఐపీఎల్)తో అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. దీని ప్రకారం ఎన్ఎస్‌డీసీ ఆమోదిత ఉద్యోగ పాత్రల ఆధారంగా శిక్షణ కార్యక్రమాలు, తరగతి గదుల్లో సిద్ధాంత బోధనతోపాటు ప్రాజెక్టు సైట్లలో ప్రాక్టికల్ శిక్షణ, అత్యాధునిక పరికరాలు, భద్రతా కిట్లు, రవాణా సౌకర్యం అందిస్తామ న్నారు.

ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు
సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఏలూరు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో ఇటీవల కానిస్టేబుళ్ల పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. తాత్కాలికంగా ఎంపికైన సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులు (పురుషులు/మహిళలు), ఏఆర్, ఏపీఎస్పీ పురుష, మహిళా అభ్యర్థులు వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో హాజరు కావాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. పాత పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్లతో ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయానికి ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ ధృవీకరణ పత్రాలు పరిశీలన జరుగుతుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, ప్రతి సర్టిఫికెట్‌కు మూడు జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారిచే ఎటెస్టేషన్ చేయించి తీసుకురావాలన్నారు.పాస్‌పోర్టు సైజు ఫోటోలు మూడు తీసుకురావాలన్నారు.

విద్యా సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యా సమస్యలు పరిష్కరించాలని తాడేపల్లిగూడెం పట్టణంలో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న పీజీ సెంటర్‌లో అన్ని రకాల పీజీ కోర్సులను ప్రవేశపెట్టాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ విద్యాసంస్థలలోకి విద్యార్థి సంఘాలు ప్రవేశాన్ని నిలుపుదల చేస్తూ సర్క్యులర్ జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ముంపు పొలాల పరిశీలన

పాలకోడేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గొరగనమూడి గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. ఎన్.మల్లికార్జునరావు, డా. గిరిజారాణి, డా. భువనేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని రైతులకు సూచనలు ఇచ్చారు.

ఘనంగా వారాలమ్మ జాతర

ఉండి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సార్వా పంటలు బాగా పండాలని, కుటుంబాలు అభివృద్ధితో వర్ధిల్లాలని అమ్మవార్లను వేడుకుని పండుగ జరుపుకున్నారు. గురువారం ఉండి కోండ్రుతుపేటలో వారాలమ్మ జాతరను భక్తులు, మహిళలు నిర్వహించారు. పేటలోని ఆయా వీధులగుండా గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు, పాటలుపడుతూ డ్యాన్సులు వేస్తూ ఊరేగింపులు జరిపారు.

పెద్దింట్లమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ఆకివీడు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దింట్లమ్మ దేవస్థా నం నూతన పాలకవర్గంతో భీమవరం భీమేశ్వరస్వామి దేవస్థానం ఈవో తోట శ్రీనివాస్ గురువారం ప్రమాణం చేయించారు. చైర్మన్‌గా గొంట్లా గణపతి, ధర్మకర్తలు కొల్లిపర లలితకుమారి, ఓరుగంటి లక్ష్మీ, బంగారు శ్యామల, అరసవల్లి రామచంద్రరావు, పెదపాటి నారాయణరావు, కిమిడి వెంకటరావు, దూబ వెంకటేశ్వరరావు, మోవ్వా పట్టాభి రామయ్యలతో పెద్దింట్లమ్మ దేవస్థానం ఈవో సత్యనారాయణరాజు సంతకాలు చేయించారు.

కుక్కునూరు, వేలేరుపాడులకు ఎండుగడ్డి తరలింపు



ఆకివీడు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):జంపన వరుణ్‌వర్మ, జేకే రాజుల ఆర్థిక సహకారంతో రెండు లారీలు ఎండుగడ్డి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని కొమ్ముగూడెం, లచ్చిగూడెం, రేపకగొమ్ము, రుద్రమకోట, కొయిదా గ్రామాలకు గురువారం పంపారు. గోదావరి వరదలు కారణంగా పశు గ్రాసం పూర్తిగా నష్టపోవడంతో పశువులు ఆకలి తీర్చేందుకు ఎండు గడ్డిని పంపించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ,రాజుదాట్ల రామరాజు, అజ్మల్, గోపి, రామరాజు, చౌదరి, వెంకన్నబాబు, నౌకట్ల రామారావు, సరళాకుమారి, శ్యామల, రవి, ఓసూరి పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగించాలని నిరసన దీక్ష



పంచాయతీ భవనం వద్ద నేలపై పడుకున్న వరప్రసాద్

ఆకివీడు రూరల్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణ తొలగించాలని అజ్జమూరు పంచాయతీ భవనం వద్ద ఎండలో గ్రామానికి చెందిన వర్దినీడి వరప్రసాద్ దీక్ష చేశాడు. కొంత కాలంగా గ్రామంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని, జిల్లా కలెక్టర్, ఆకివీడు మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశానని, ఆక్రమణ తొలగించమని ఉన్నతా ధికారులు ఆదేశించినా స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్య పరిష్కరించే వరకు తాను దీక్ష విరమించబోనని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మార్కం దేయేశ్వరరావు, ఇతర అధికారులు వచ్చి సమస్య పరిష్కారానికి చర్చించారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి

పాలకోడేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గరగపర్రు గ్రామంలో గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు వరినారు వేసినప్పటి నుంచి పంట కాలం అయ్యే వరకు రసాయన ఎరువులు, పురుగు మందుల పైనే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని, దీనివల్ల పెట్టుబడి వ్యయం ఎక్కువ అవ్వడమే కాకుండా పండిన పంటలో విషతుల్యత శాతం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అంతేగాకుండా పర్యావరణంతో పాటు మానవ దేహానికి కూడా నష్టం చేకూరుతుందని తెలిపారు. సాధ్యమైనంత వరకు రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలన్నారు.

భార్య, కుమార్తెల అదృశ్యం

ఉండి, ఆగస్టు, 21(ఆంధ్రజ్యోతి): పాములపర్రు గ్రామానికి చెందిన పొదిలి హరీష్ తన భార్య కరుణ(24), కుమార్తె(6) అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకున్నట్లు భీమవరం రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపారు. కొమరాడ గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 17,140 స్వాధీనం చేసుకున్నామన్నారు.

వరద పోటు

(5వ పేజీ తరువాయి)



సిద్ధాంతం వద్ద గట్లును తాకిన వరద

పుష్కరఘాట్‌లు నీటమునిగాయి. ఉధృతి ఇలాగే కొనసాగితే లంకగ్రామాలైన లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, బాడవ గ్రామాలు ముంపు బారిన పడతాయని ఆందోళనకు గురవుతున్నారు.


కనకాయలంకలో జేసీ పర్యటన

కనకాయలంకలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పడవలో గురువారం పర్యటించారు. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో వరద పెరుగుతోందని.. పెనుగొండ, ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని లంక గ్రామాలు వరదబారిన పడే అవకాశం ఉండటంతో ఆయా మండలాల రెవెన్యూ, ఆరోగ్య, విద్యుత్తు, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కనకాయలంకలో గ్రామస్తుల రాకపోకలకు ఆరు బోట్లు ఏర్పాటు చేశామన్నారు. కనకాయలంక నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులకు సూచించామన్నారు.

నిలకడగా కొల్లేరు

కైకలూరు : కొల్లేరు ఉధృతి గురువారం కొద్ది మేరకు తగ్గి నిలకడగా ప్రవహించడంతో రహదారులు కొద్దికొద్దీగా కోలుకుంటున్నాయి. మండవల్లి మండలం పెనుమాకలంక రహదారిపై నాలుగు అడుగుల మేర ప్రవహించిన నీరు రెండు అడుగులకు తగ్గింది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతి తగ్గింది.

చించినాడ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి



చించినాడ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు

యలమంచిలి : గోదావరి వరద పెరుగు తున్న నేపథ్యంలో చించినాడ బ్రిడ్జిపై వాహనాలు తిరిగేందుకు గురువారం అనుమతి ఇచ్చారు. చించినాడ బ్రిడ్జి మరమ్మతులు చేపట్టేందుకు కొన్ని రోజులుగా లైట్ వెహికల్స్‌ను మాత్రమే బ్రిడ్జిపై రాకపోకలు సాగించేందుకు అనుమ తిస్తున్నారు. 21, 22, 23 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకూ వాహనాల రాకపోకలను నిలిపివేయనున్నామని ప్రకటించిన నిర్ణయాన్ని గురువారం ఉదయం విరమించారు. ఉభయ గోదావరి జిల్లాల మధ్య ప్రజలు రాకపోకలు సాగించే పలుచోట్ల ఉన్న పంట్లు, బోట్లు నిలిపివేసిన దృష్ట్యా బ్రిడ్జిపై రాకపోకలు రద్దు నిర్ణయాన్ని విరమించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో ఆందోళన చేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీలు

తణుకు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం వెంకటేశ్వర సెంటర్‌లో అంగన్‌వాడీల ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె కాలపు ఒప్పందాలు, కనీస వేతనం రూ.26వేలు వెంటనే అమలు చేయాలని అన్నారు. వేతనాలు పెంచాలని, ఎఫ్‌ఆర్ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని నినాదాలు చేశారు.

పెంటపాడు: పెంటపాడు గేటు సెంటర్ వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, ప్రాజెక్టు అధ్యక్షురాలు జె.శ్యామలాకుమారి, కె.కనకమహాలక్ష్మి, ఆర్.అనురాధ, జి.జయలక్ష్మి పాల్గొన్నారు.

ఉండి: తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. మండల సీఐటీయూ కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కాళ్ల: కాళ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసనకు దిగారు. సీఐటియూ జిల్లా నాయకులు మండా సూరిబాబు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కి వినతి పత్రం అందించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కాళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి తెలిపారు. పెద అమిరంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పానకాల కృష్ణాంజనేయరావు అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో ఆకివీడు ఏఎంసీ డైరెక్టర్‌గా నియమించబడ్డ పానకాల కృష్ణ, కాళ్ల సొసైటీ కమిటీ సభ్యురాలిగా ఎంపికైన కట్రెడ్డి కనకదుర్గలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరా రామ్మూర్తి, ఉండి ఇన్‌చార్జి కలిదిండి వినోద్ వర్మ, కాయిత సురేంద్ర, కట్రెడ్డి కనకదుర్గ, యాతం సుబ్బారావు పాల్గొన్నారు.

మానవతా శాంతి ర్యాలీ

పెంటపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 60 వేల సభ్యత్వాలు కలిగిన ఏకైక సంస్థ మానవతా స్వచ్ఛంద సంస్థ అని సంస్థ జిల్లా అధ్యక్షుడు కండెపు సూర్యనారాయణ తెలిపారు. గురువారం పెంటపాడులో మానవతా శాంతి ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పచ్చిమగోదావరి జిల్లా విద్యా కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ 136 మండలాల్లో విస్తరించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

డీఆర్‌జీలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

పెంటపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టీఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న బీఏ, బీఎస్సీ, బీకాం మిగిలిన గ్రూపులలో విద్యార్థులు చేరవచ్చు అన్నారు.

ఇష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు

పెంటపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు పొందవచ్చునని సైక్రియాటిస్ట్ టి.గంగాధర్‌రెడ్డి అన్నారు. అలంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం తాడేపల్లిగూడెం దేవి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మత్తు మందుల నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకూడదన్నారు.

మంత్రులకు ఆహ్వానం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఈ నెల 28వ తేదీన భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి వాసంశెట్టి సుభాష్ తదితరులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఐటీఐకు దరఖాస్తుల ఆహ్వానం

ఆచంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):ఆచంటలోని గవర్నమెంటు ఐటీఐలో ప్రవేశానికి 2025-26 విద్యా సంవత్సరంకు సంబంధించి 3వ విడత (2వవిడతలో మిగిలిన సీట్లు) కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇందుకూరి సత్యనారాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరే విద్యార్థులు ధ్రువపత్రాల నకళ్లను ఈ నెల 26 లోపు కళాశాలలో అందజేయాలని, ఈ నెల 29న కౌన్సెలింగ్‌కు వచ్చే అభ్యర్థులు ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్‌లు తీసుకుని హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబరు 9490111002కు సంప్రదించాలని కోరారు.

ఆక్వా రైతుల్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

ఉండి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భూపతిరాజు బలరాం ఆరోపించారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఆక్వా రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం ఆక్వారైతుల జిల్లా సదస్సు జరిగింది. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌లో వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసేందుకు భారీగా సుంకాలను విధిస్తున్నారని విమర్శించారు. భారత్ ఎగుమతి చేసే వస్తువులపై సుమారు 60శాతం సుంకాలు విధిస్తుంటే, మిగిలిన దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై కేవలం 15శాతం మాత్రమే సుంకాలు విధిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు ఆక్వారైతులకు యూనిట్‌కు విద్యుత్ ధర రూ.1.50పైసలకే అందించాలని కోరారు.

మత్తు నుంచి యువతను కాపాడాలి

గణపవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ముప్పు నుంచి యువతను, విద్యార్థులను కాపాడుకోవాలని, మత్తుపదార్థాల సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు అందరూ సమష్టిగా ఉద్యమించాలని ప్రభుత్వ డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి కోరారు. గురువారం గణపవరం చింతలపాటిమూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీకాలేజీలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తుపదార్థాల ముప్పు నుంచి యువతను, విద్యార్థులను రక్షించటం అందరి ప్రధాన బాధ్యతగా బావించాలన్నారు.

170 పింఛన్లు తొలగింపు

నరసాపురం రూరల్, ఆగస్టు(21) వివిధ కారణాల రీత్య మండలంలో 170 పింఛన్లు రద్దు చేసినట్లు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. ప్రభుత్వం రద్దు చేసిన పింఛన్‌దారులకు మళ్లీ ఆన్‌లైన్ చేసుకునే అవకాశం ఇచ్చినందున లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు.

పునరుత్పత్తితో పురుగులు, తెగుళ్ల నివారణ

తణుకు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పైరు తొలిదశలో పురుగులు లేదా తెగుళ్ల వలన ఏదైనా నష్టం జరిగితే దానిని పంట పునరుత్పత్తి ద్వారా రక్షించవచ్చని తణుకు సబ్ డివిజనల్ వ్యవసాయ శాఖ సంచాలకులు జీ నరేంద్ర చెప్పారు. గురువారం కొమరవరం గ్రామంలో మండల వ్యవసాయాధికారి కే రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండిజీనియస్ గ్యాప్ సర్టిఫికేషన్ పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు వివిధ అంశాల గురించి వివరించారు. పైరు తొలి దశలో ఎదురయ్యే తెగుళ్ళ, పురుగుల వలన ఏదైనా నష్టం జరిగితే పురుగు మందులు పిచికారి చేయవలసిన అవసరం లేకుండా ఏవిధంగా పంట పునరుత్పత్తి చేయవచ్చనో రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు.

గణపతి ఉత్సవాల పందిళ్లకు అనుమతి తప్పనిసరి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాల నిర్వహణ కమిటీలు పోలీసుల అనుమతి తీసుకోవాలని పట్టణ సీఐ ఆదిప్రసాద్ సూచించారు. తాడేపల్లిగూడెంలోని గణపతి ఉత్సవ కమిటి నిర్వాహకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు చేసే వారు ఎలాంటి గొడవలు అల్లర్లు లేకుండా చూడాలని, పందిళ్ల ఏర్పాటు, ఊరేగింపులకు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగరాజు, బాదం శ్రీను సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నూరు సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



సొసైటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్సీ అంగర

పోడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నిబద్ధ త గల పాలకవ ర్గాలే సహకార సంఘాలకు ప్రా ణం వంటివని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. గురువారం జిన్నూరు సొసైటీ చైర్మన్‌గా దేవళ్ల ప్రసాదు, సభ్యులుగా చొప్పల రాజమణి, దొమ్మేటి రామప్రసాదు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకొల్లు ఏఎంసీ చెర్మన్ కోడి విజయభాస్కర్, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారా యణరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పాలవలస తులసీరావు, ఏఎంసీ వైస్ చెర్మన్ దాసరి రత్నరాజు, డీసీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, వైస్‌చైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, కార్యదర్శి పెచ్చెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

యలమంచిలి: బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా బోనం శ్రీరామకృష్ణ, సభ్యులుగా అనిశెట్టి రామకృష్ణ, పితాని త్రిమూర్తులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర, టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల కొరత నివారించండి

పోడూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లు లేకపోవడంతో ధ్రువపత్రాలు, రేషన్‌కార్డులు వంటి సేవలు ప్రజలకు అందటం లేదని సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, గుంటూరి రామకృష్ణంరాజు, ఎంపీటీసీలు పోడూరి నాగరాజారావు తదితరులు గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ధ్వజ మెత్తారు. సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ ప్రస్తుతం ఉన్న కొద్దిమంది రెండేసి, మూడేసి గ్రామాల్లో పనిచేస్తున్నారనీ దీంతో ప్రజలు రోజూ సచివాలయాల చుట్టూ తిరుగుతూ పనులు మానుకొని నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు మాట్లాడుతూ పశువులకు చేసే ఇన్సూరెన్స్ పథకంపై గ్రామాల్లో చాలామంది రైతులకు అవగాహనలేక నష్టపోతున్నారన్నారు.

రాజగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా శ్రీరామ్

నరసాపురం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాజగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా రామవరపు శ్రీరామ్ నియమితులయ్యారు. ఆయనతో పాటు డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు తీసుకున్న పాలకవర్గం గురువారం ప్రభుత్వ విప్ నాయకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బార్.. సిండికేట్

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తు కూడా అందలేదు. ఒక్కో దరఖాస్తుకు గతంలో రూ. 7.50 లక్షల రుసుం ఉండేది. ఈసారి దానిని రూ. 5 లక్షలకు తగ్గించింది. అయితే ప్రతి బార్‌కు లాటరీ తీయాలంటే కనిష్ఠంగా నాలుగు దరఖాస్తులు ఉండాలని బార్ పాలసీలో ప్రకటించారు. దీనిపై ప్రస్తుత లైసెన్స్‌దారులు కాస్త అసంతృప్తితో ఉన్నారు. లైసెన్స్ ఒకరి పేరుతో ఉన్నాసరే అందులో భాగస్వాములు అనేకమంది ఉంటారు. వారంతా ఇప్పుడు లైసెన్స్ వేయకూడదంటూ జిల్లాలో మూకుమ్మడి నిర్ణయం తీసుకున్నారు. లైసెన్స్ దరఖాస్తు రుసుము గీత కార్మికులకు 50 శాతం తగ్గించింది. మరోవైపు ప్రతిఏటా లైసెన్స్‌దారులు నిర్ణీత రుసుము చెల్లించాలి. పట్టణాల్లో 50 వేలు జనాభా దాటితే రూ. 55 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లో బార్‌లకు రూ.55 లక్షలుగా నిర్ణయిం చారు. ఆకివీడు అయితే 50 వేల లోపు జనాభా ఉంది. అక్కడ ఏడాదికి రూ. 35లక్షలు చెల్లిస్తే సరి పోతుంది. ఏడాదికి అదనంగా 10 శాతం అదనంగా రుసుం చెల్లించాలి. మూడేళ్ల కాలానికి బార్ లైసెన్స్‌లు మంజూరు చేస్తారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కొత్త బార్‌లు అమలులోకి వస్తాయి. లైసెన్స్‌లు 2028 ఆగస్టు 31తో ముగియనున్నాయి. ఈసారి నష్టాలు వస్తాయన్న భావనతో బార్ యజమానులు తర్జనభర్జనలు పడుతున్నారు.

పడిపోయిన అమ్మకాలు

వైసీపీ హయాంలో బార్‌లలో అమ్మకాలు మూడు పువ్వులు ఆరుకాయలుగా వృద్ధి చెందాయి. భారీ లాభాల్లో పయనించాయి. ప్రభుత్వ మద్యం షాపుల్లో నాణ్యమైన మద్యం దొరికేది కాదు. ఎమ్మార్పీ కంటే అదనంగా రూ. 50 అధిక ధరలకు విక్రయించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు మద్యం పాలసీ అమలు చేసింది. ప్రైవేటు దుకాణాల్లో నాణ్యమైన బ్రాండ్‌లు అమ్మకాలు సాగిస్తున్నారు. ధరలు కూడా తగ్గాయి. దాంతో బార్‌లలో అమ్మకాలు పడిపో యాయి. ఇంకోవైపు ప్రైవేటు మద్యం షాపుల్లో రూ. 7.50 లక్షలు వ సూలు చేసి పర్మిట్ రూమ్‌లు ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ ప్రణాళిక రూపొందించింది. అదే జరిగితే బార్‌లలో అమ్మకాలు తగ్గుతాయని యజమానులు అంచనా వేస్తున్నారు. బార్‌లకు కూడా ఊరట ఇచ్చేలా నిర్ణయం తీసుకుంటారని అంతా ఆశించారు. ప్రైవేటు మద్యం షాపులకు ఎమ్మార్పీ ధరలకు 14 శాతం తగ్గించి ఎక్సైజ్ శాఖ మద్యం సరఫరా చేస్తోంది. అదే తరహాలో బార్‌లకు కూడా సరఫరా చేస్తారని ప్రచారం సాగింది. ఫలితంగా ఈసారి దరఖాస్తులు చేసుకోవాలని అంతా ఎగబడే ప్రయత్నం చేశారు. చివరకు ఎంఆర్‌పీకే బార్‌లకు మద్యం సరఫరా చేయాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రైవేటు మద్యం షాపుల్లో ఎంఆర్‌పీకే మద్యం లభ్యమవుతుంది. బార్‌లలో అంతకు మించి ధరలకు అమ్మకాలు సాగించాలి. దాంతో బార్‌ల అమ్మకాలు గతంతో పోల్చుకుంటే 50 శాతం కూడా ఉండడం లేదు. ఇది కూడా బార్ లైసెన్స్‌దారులను ఆందోళనకు గురిచేస్తోంది.

ముమ్మర ప్రచారం

కొత్త బార్ లైసెన్స్ విధానంపై ఎక్సైజ్ శాఖ ముమ్మర ప్రచారం చేస్తోంది. పట్టణాల్లో ఏర్పాటు చేసే బార్‌లకు దరఖాస్తు చేసుకోవాలంటూ ఐవీఆర్ పద్ధతిలో ఫోన్ కాల్స్ చేస్తున్నారు. మహిళలకు కూడా ఇటువంటి కాల్స్ వెళుతున్నాయి. ఈనెల 18వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటిదాకా జిల్లాలో ఒక్క బార్‌కు కూడా దరఖాస్తు నమోదు కాలేదు. ప్రస్తుతానికి దరఖాస్తులు సమర్పించకూడదంటూ జిల్లా బార్ అసోసియేషన్ ఒక నిర్ణయానికి వచ్చింది. ఇప్పటిదాకా ఒక్క దరఖాస్తు రాకపోవడంపై అధికారుల్లోనూ ఒకింత చర్చ సాగుతోంది.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

తాడేపల్లిగూడెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డులో వినాయక వేడుకలు పురస్కరించుకుని వినాయకచవితి రాట ముహూర్తంలో జనసేన యువ నేత బొలిశెట్టి రాజేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజా, పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, జిల్లా కార్యదర్శి మద్దాల మణికుమార్, కాళ్ల గోపీకృష్ణ పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అంజిబాబు దంపతులు

వైభవంగా వాడపల్లి వెంకన్న కల్యాణం

భీమవరం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. వాడవాడలా వాడపల్లి వెంకన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అర్చకులు ఉత్సవ మూర్తులకు వివాహ పక్రియను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు దంపతులు స్వామి వా రికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వేలాది మంది స్వామి వారి కల్యాణం తిలకించారు.

నరసాపురంలో పేర్ని నాని



స్థానికులతో మాట్లాడుతున్న పేర్ని నాని

నరసాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని గురువారం ఆకస్మికంగా నరసాపురం పట్టణంలో ప్రత్యక్షమయ్యారు. మచిలీపట్నం నుంచి కాకినాడ వెళుతూ మార్గంమధ్యలో నరసాపురం పట్టణంలోని సెంటర్‌లో హోటల్ వద్ద కారు దిగారు. అప్పటికే అక్కడ ఉన్న కొందరు వైసీపీ నాయకులు ఆయన్ను చుట్టుముట్టారు. టిఫిన్ తినాలి.. ఎక్కడ బాగుంటుందని ఆరా తీసి సమీపంలోని హోటల్‌కు వెళ్లారు. అక్కడ అల్పాహారం తింటూ.. సమీపంలో ఉన్న ప్రజల్ని పలకరించి ప్రభుత్వ పాలన ఎలా ఉందంటూ అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. స్థానిక వైసీపీ నాయకులు కూడా ఆయనకు పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పాలనపై అనేక విషయాలను చెప్పే ప్రయత్నం చేశారు. ఆయన్ని కలిసిన వారిలో వైసీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం చైర్మన్ యర్రా శ్రీను, సురేష్ ఉన్నారు.

బండారును కలిసిన గంగాధర్

నరసాపురం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నరసాపురం మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడిగా నియమితులైన దేశినీడి గంగాధర్‌ను గురువారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఘనంగా సత్కరించారు. బాధ్యతలు చేపట్టిన గంగాధర్ మర్యాదపూర్వకంగా బండారును కలిసేందుకు మండలంలోని సరిపల్లి గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా బండారు ఆయన్ని శాలువాతో సత్కరించారు. కూనపరెడ్డి రంగరావు, కొట్టు పండు, మల్లిక్, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా జట్లపాలెం, ఉమామహేశ్వరం, మౌంజీపాడు, ప్రత్తిపాడుతో పాటు ఇండస్ట్రీ ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు.

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్:శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. పడాల, పడాలగరువు, యాగర్లపల్లి ఏరియా, ముత్యాలంబాపురం, కొబ్బరితోట, జట్లపాలెం ఏరియా విద్యుత్ ఉండదని తెలిపారు. తాడేపల్లిగూడెం మండలంలోని ఎన్టీయార్ నగర్, కుంచనపల్లి, మోదుగగుంట, జగన్నాథపురం, కొండ్రుప్రోలు, టిడ్కో ఇళ్ల సముదాయం, ఎల్ అగ్రహారం, మెట్టఉప్పరగూడెం, మోదుగగుంట, అప్పారావుపేట, గొల్లగూడెం, వెంకట్రావుపాలెం, పట్టింపాలెం, వెంకట్రామన్నగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదు.

మధుమేహ పరీక్షలు

తణుకు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కార్యాలయంలో గురువారం మధుమేహ రక్త పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన పరీక్షలు 58 మందికి చేసి రిపోర్టులు అందజేశారు. న్యూరో వైద్యులు డాక్టర్. బి. రమేష్‌కుమార్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్యం పరిశీలన

ఆకివీడు రూరల్ ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆకివీడు మండలంలోని తరటావ, సిద్ధాపురం, అయిభీమవరం, మందపాడు గ్రామాలలో ఆయన పర్యటించారు. తరటావ మంచినీటి చెరువులోని నీటిని మార్చు చెయ్యాలని ఆదేశించారు. గ్రామాలలో చెత్త సేకరణ జరుగుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. స్వమిత్వ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రాథమిక అవసరాలు అడిగి తెలుసుకున్నారు. డంపింగ్‌యార్డులో ఘన వ్యర్థాలు నిర్వహణ అడిగి తెలుసుకున్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

పెనుగొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వర్షాలకు మునిగి నష్టపోయిన చిన్న సన్న కారు, కౌలు రైతులను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. పెనుగొండ చెరుకువాడ ప్రాంతంలో సుమారు 10 ఎకరాలు మునిగి ఎందుకు పనికి రాకుండా పోయాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మునిగిపోయిన, కుళ్ళిపోయిన పంట పొలాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతాంగానికి 20 వేలు రూపాయలు ఇవ్వాలన్నారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించవద్దు

మొగల్తూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):తనిఖీల్లో భాగంగా దివ్యాంగత్వం కలిగిన అర్హుల పింఛన్‌లు తొలగించవద్దని మదర్ థెరిస్సా దివ్యాంగుల సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కాల నాగ శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బోగస్ సర్టిఫికెట్‌లు తనిఖీల్లో భాగంగా నియోజకవర్గంలో దివ్యాంగత్వం కలిగిన కొందరి అర్హుల పింఛన్‌లు 40శాతం లోబడి దివ్యాంగత్వం ఉందంటూ రద్దు చేశారని అటువంటి వారిని మరో సారి పరీక్షించి పింఛన్‌లు రద్దు కాకుండా చూడాలని ఆయన కోరారు.